


## వేములపల్లి మోహనరావు

లండన్ హీత్రూ ఎయిర్‌పోర్ట్‌లో జంబో దిగగానే నాకు మొదట కనిపించిన వ్యక్తి మహారాణి. నన్ను చూడగానే ఆమె కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. ఎంతో ఆప్యాయతతో నా కుడిచెయ్యి నొక్కుతూ అంది - 'వాటే ప్లజంట్ సర్‌ప్రైజ్. ఇది పారిస్‌ఫ్లైటనుకుంటాను. ఇండియానుండి కాదా మీరు రావడం?'

'లేదు. వారమైంది పారిస్ వచ్చి. నిన్ననే పనిపూర్తయింది. ఈ రోజు ఇక్కడ ఓ ప్రైవేట్ ఫరమ్‌తో అగ్రిమెంట్స్ సైన్ చేయించాలి. మళ్ళీ ఎల్లుండి రాత్రికల్లా మిలాన్‌లో ఉండాలి' అన్నాను.

ఇంతలో నన్ను చూసి కెర్నీ రిచర్డ్ ముందుకు వచ్చాడు. అతను అక్కడ కస్టమ్స్‌లో పనిచేస్తున్నాడు. నాకు క్లోజ్ ఫ్రెండ్. అతనుంచే నాకు హోటల్ రిజర్వేషన్‌తోసహా అన్ని ఏర్పాట్లూ తనే చేసిపెడతాడు. అందుకే అతను డ్యూటీలో ఉండే సమయాల్లోనే ప్రయాణం పెట్టుకుంటాను నేను.

ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయి ఎయిర్‌పోర్ట్ బయటకు వచ్చేసరికి టైమ్ ఏడయింది. దీపాల ప్రవాహాల్లా కార్లు. ఆ దీపాల వెలుగుపడి తళతళ ప్రతి ఫలించే రోడ్లు.

'కారుందా, టాక్సీలో వెళ్దామా' అన్నాను.

'ఇంకా నయం. ఈ మహానగరంలో కారు లేకుండానా !' నవ్వింది మహా రాణి. అదే నవ్వు. రాజ్యాలను సైతం జయించి ప్రజల్ని మంత్రముగ్ధుల్ని చెయ్యగలిగే నవ్వు. ఇన్ని సంవత్స రాల్లోనూ ఆమె ఏమీ మారలేదు. క్షణం పాటు ఆమెనే తదేకంగా చూస్తూండి పోయాను. కించిత్తు సిగ్గుపడిందామె. బట్టలు విప్పుకుని విచ్చలవిడిగా స్త్రీలు మగవాళ్లతో రాసుకుతిరిగే ఈ నగరంలో ఎర్రబడిన బుగ్గలూ, కొంచెం వాలిన కళ్ళూ నాకెంతో రిలీఫ్ నిచ్చాయి.

అంత రద్దీరోడ్లలోనూ సిగ్నల్స్ జాగ్రత్తగా గమనిస్తూ నేర్పుగా డ్రైవ్ చేస్తున్నదామె. ఎర్రటి బుల్లి వోక్స్ వాగన్‌కారు. కొంచెం చలిగా ఉన్నట్లని పించి హీటర్ ఆన్‌చేశాను. కొద్దిక్షణా ల్లోనే కారంతా వెచ్చగా అయిపోయింది.

'అవునూ ! ఇంతకీ నువ్వు ఎయిర్ పోర్ట్ కెందుకొచ్చినట్టు ?' అన్నాను.

'నీకోసమే' అంది తను కొద్దిగా పెదవులు బిగబట్టి వస్తున్న నవ్వును ఆపుకుంటూ.

'థాంక్స్ ! ట్రై ఎనదర్ కాజ్' అన్నాను.


'మా దూరపు బంధు వొకాయన ఇక్కడికి విజిట్ కొస్తున్నట్టు కేబుల్ వచ్చింది నాలుగురోజులక్రితం. ఆయన్ని రిసీవ్ చేసుకుందామని !'

'మరి ఆ విమానం రాకముందే వచ్చేస్తున్నావే !' అన్నాను కొద్దిగా కంగారుగా.

'లెట్ హిమ్ గోటు హెల్. హీ ఈజ్ నాట్ సో ఇంపార్టెంట్.'

అంతే. మహారాణీలు మనుషుల్నే కాదు, వేటినీ లెక్కచెయ్యరు. కాసేపాగి అడిగాను. 'ఇంతకీ నువ్విక్కడేం చేస్తున్నట్టు ?'

'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైకా లజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను.' అప్పుడు చూశాను ఆమె జుత్తులో కనపడీ కనపడని ఒకటి రెండు వెండి తీగల్ని. అప్పటివరకూ ఆమె నా కళ్లకు విజయవాడలో మేరీస్టెల్లాకు ఠీవిగా, దర్పంగా ఒక




చేత్తో పుస్తకాల్ని గుండె కదుముకుని మరో చేతిని నిర్లక్ష్యంగా ఊపుకుంటూ నడిచి వెళ్ళే పదిహేడేళ్ల పరికిణీ ఓణీల అమ్మాయిలాగే కనిపించింది.

మా పరిచయమే చాలా విచిత్రం. తను బస్ ఎక్కబోయే సమయంలోనే నేనూ బస్ దిగేవాణ్ణి. మొదటి రెండు రోజులూ నన్నసలు చూడకపోయినా మూడో రోజునుండి నన్ను గమనిస్తోం దని కనిపెట్టాను. ఆమెతోపాటు మరో ఇద్దరుండేవారు చెలికత్తెల్లాగ. నేను ఒంటరిగాణ్ణి. చేతిలో పెన్నుమాత్రం ఉండేది. నా పుస్తకాలు కాలేజీలోనే ఉండేవి. రెండు సంవత్సరాల అనుభవం ఉందేమో, పిల్లలకు పాఠాలు చెప్పడానికి నేను ఇంటిదగ్గర ప్రిపేరయ్యేవాణ్ణి కాదు. అందుకే పుస్తకాలు ఇంటికి తీసుకు వచ్చేవాణ్ణికాదు.

ఒకవారం తర్వాత వాళ్లల్లో వాళ్ళు నవ్వుకోవడం, నన్ను చూసి గుసగుస లాడటం మొదలుపెట్టారు. అందమైన ఆడపిల్లలు ఏంచేసినా లైట్‌గా తీసుకునే మనస్తత్వం నాది. ఆ రోజుల్లో మైసూరు నుండి మా మామయ్య పంపిన గంధం సెంటు రాసుకునేవాణ్ణి. ఒకరోజు నాకు వినపడేలా అంది.

'ఈ అబ్బాయి ఏం సెంటు రాసుకుంటాడో మనక్కూడా కొంచెం తెలిస్తే బాగుండును లతా!'

వెంటనే అన్నాను నేను. 'అది సెంటుకాదు పాపా! అందమైన బ్రహ్మచారుల శరీర సుగంధం!' తెల్లబోయి

చూస్తున్న వాళ్లను వదిలేసి ముందుకు సాగాను. తర్వాత ఒకరోజు నన్ను రోడ్డుమీద నిలబెట్టేసింది.

'ముందీ సంగతి చెప్పండి. మీరు లెక్చరరా!'

'ఏం అయితే' అన్నాను మెల్లగా నవ్వుతూ.

'అయ్యో! ఇంకా మేం ఎవరో రోడ్ సైడ్ రోమియోలే, పుస్తకాలు లేకుండా కాలేజీకి వెళ్లే షోకిల్లా అనుకున్నాం మాస్టారూ. క్షమించండి' అంది.

'అరే, దేనికీ?' అన్నాను నేను.

'అయితే మీరు రోజూ మేంచేసే కామెంట్లు వినడంలేదా?'

'ఏం కామెంట్లు?' అన్నాను నేను కొంచెం సీరియస్‌గా.

అంతే. పరిగెత్తిందా అమ్మాయి.

ఇంకోరోజు. 'ఈ రోజు నా బర్త్‌డే. సాయంత్రం మనోరమలో పార్టీ ఇస్తున్నాను. తప్పకుండా రండి. అప్పటి దాకా ఈ టాఫీ తినండి.'

మా సంభాషణంతా రోడ్డుమీదే సాగినా కించిత్తు కూడా భయపడేది కాదామె ఎవరైనా చూస్తారేమోననీ, ఏమైనా అనుకుంటారేమోననీ నేనే కొంచెం వెనకాడేవాణ్ణి.

ఆ సాయంత్రం మంచి ప్రజంటేషన్ పట్టుకుని పార్టీకి హాజరయ్యాను. చాలా గర్వంగా నన్ను తన ఫ్రెండ్స్‌కు పరిచయం చేసుకుంది.

ఆ రాత్రి వీడ్కోలు తీసుకుంటూ 'వెళ్ళొస్తాను మహారాణీ' అన్నాను.

'అదేమిటి? నా పేరు శారద.'

'కానీ నాకు మాత్రం మహారాణివే. నీ ఠీవీ, నీ హుందా మహారాణుల్లో తప్ప కనిపించవు! వెళ్లబోయేముందు ఆ వెన్నెల్లో, ఆమె కళ్లల్లో మెరిసిన ఆరాధనాపూర్వకమైన మెరుపును మనసులో దాచుకుని కదిలాను.

ఆ సంవత్సరమే నేను ఉద్యోగరీత్యా ఇంకో ఊరికి బదిలీకావడంతో ఆమెను తర్వాత చూడలేదు. పధ్నాలుగేళ్ల తర్వాత మళ్ళీ ఇలా...

'ఎక్కడుంటున్నావ్?' అన్నాను టైనాట్ వదులు చేసుకుంటూ.

'ఫైవ్‌బై ఫోర్టీన్, నెల్సన్ ఎవెన్యూ, ఓల్డ్ బాండ్ స్ట్రీట్. యార్డ్‌లీకి దగ్గర్లో' అంది.


'అందుకే నన్నమాట ఈ పరిమళపు ఉధృతాలు' అన్నాను.

'కాదులే. అందమైన బ్రహ్మచారిణుల శరీర సుగంధం అది.'

ఇద్దరం మనసారా నవ్వుకున్నాం. ఆ కొద్దినిమిషాల్లోనే నా కాంట్రాక్టులూ, టాక్సులూ, లైసెన్సులూ అన్నీ మరిపించేసి మరో లోకంలోకి, మమతలున్న, ప్రేమలున్న లోకంలోకి తీసుకెళ్ళిందామె.

'నాకు రూం రిచ్‌మండ్ హోటల్లో బుక్‌అయింది. నన్నక్కడ దింపెయ్యి.

నిత్యజీవితంలో హస్తాభినయములు "శిఖరము"




తర్వాత కలుస్తాను' అన్నాను. తీక్షణంగా చూసిందామె నావైపు. నేనింకో మాట మాట్లాడటానికి జంకాను. సీజరైనా, క్లియో అలాచేస్తే మాట్లాడలేదేమో.

మరి కాసేపటికి ఆమె ఫ్లాట్లో ఉన్నాం ఇద్దరం. టీవి ఆన్‌చేసి విండో కర్టెన్స్ పక్కకు లాగి లోపలి కెళ్ళిందామె. ఆ ఐశ్వర్యం, అలంకారాలూ నాకేం కొత్త కాకపోయినా మహారాణి ప్రత్యేకత ఆ రూంలో నా చూపుల్ని కట్టేసింది.

'ఏం తీసుకుందాం' అందామె ఫ్రిడ్జ్ తెరుస్తూ.

'జస్ట్ షాంపేన్' అన్నా న్నేను.

ఇద్దరం ఆ షాంపేన్ సిప్ చేస్తూ టీవీ చూశాం కాసేపు. అలా చూడటమనేది మా మనసుల్లో ఎగిసిపడే తరంగాల ఘోషలను దాచుకోవడానికేనని మా ఇద్దరికీ తెలుసు.

కిటికీదగ్గర నిలబడి కిందికి చూస్తే ఎన్నో బారు కారులు. కారుల బారులు. రెండు నిమిషాల తర్వాత అన్నాను నేను, కోటు చేతిలోకి తీసుకుంటూ. 'వెల్, మళ్ళీ ఎప్పుడైనా కలుద్దాం!'

నా భుజంమీద చెయ్యివేసి సోఫాలోకి తోసింది. నా పక్కనే కూర్చుని నా మొహంలోకి చూస్తూ అంది – 'మీకర్థంకాదు రాజా. ఆ రోజుల్లో మిమ్మల్నెంత అభిమానించేదాన్ని? చివరకు





వెళ్ళిపోయేప్పుడు మాటమాత్రమైనా చెప్పలేదు మీరు. నేనెంత వేదన అనుభవించానో ఆ దేవుడికే తెలియాలి.'

గ్లాస్‌లో మిగిలిన ద్రవాన్ని మింగేసి ఆమె చేతుల్లో చిక్కుకున్న నా చేతిని, ఆమె చూపుల్లో చిక్కుకున్న మనసునూ విడిపించుకోబోయాను. మరింత గట్టిగా పట్టుకుందామె.

'అరెరె ! నీ ఉంగరం గుచ్చుకుంటోంది వదులు' అన్నాను. చెయ్యి వదిలేసింది. అప్పుడు చూశాను ఆ ఉంగరాన్ని. స్వతహాగా పెద్ద నటుణ్ణేమో, నాలోని భావాన్ని నిరంకుశంగా అణగదొక్కి పైకి మామూలుగా ఉండగలిగాను. లేకపోతే...

పదేళ్ళక్రితం ధవళేశ్వరం దగ్గర గోదావరి ఒడ్డున పరిగెత్తి, పరిగెత్తి అలిసిపోయి నా ఒళ్ళో తలపెట్టుకుని ఆయాసంతో ఎగిసిపడుతున్న గుండెల మీద చెయ్యివేసుకుని, నా కళ్ళల్లో కళ్ళు కలిపి వాటిలోని మత్తునంతా నా మనసులోకి జొప్పిస్తున్న రమను గట్టిగా హత్తుకుని ఆమె చేతికి నేను తొడిగిన ఆ పచ్చరాళ్ళ ఉంగరం, హృదయం



ఆకారంలో రావాలని చేయించుకుని ప్రాణంగా చూసుకుంటూ, తనుమాత్రం నా ప్రాణంకాదా అనే ఉద్దేశ్యంతో రమ మధ్య వేలికి తొడిగిన ఆ ఉంగరం, ఆ తర్వాత నాకు దొరికిన ఆ ఎర్రటి పెదవుల సుధారసం అన్నీ ఒక్కుమ్మడిగా గుర్తొచ్చి గుండెను పట్టి కుదిపినప్పుడు, ఏమీ ఎరగనట్టు 'ఉంగరం బావుంది. ఎక్కడ కొన్నావ్ !' అని అడగడం ఇంకొకడివల్ల అయ్యేపనేనా !

'చాలా పెద్ద కథ రాజా! రమ అనుకుంటాను ఆ అమ్మాయి పేరు. ఆమెదీ ఉంగరం. మా కజిన్ ఒకతనున్నాడు రాజేష్ అని. మంచి ఆస్తిపరుడు. ఇద్దరూ కలిసి తిరిగారు చాలా రోజులు. తర్వాత ఏదో ఏక్సిడెంట్‌లో ఆ అమ్మాయి చచ్చిపోయింది. ఆమె గుర్తుగా అతని కా ఉంగరం మిగిలిపోయింది. నాలుగేళ్ళ క్రితం నేను ఇండియా వెళ్ళినప్పుడు నన్నతనికి ప్రపోజ్ చేశారు. కానీ అతను ఒప్పుకోలేదు. నాకు అతను చెప్పిన కారణం ఒక్కటే. రమను తను మర్చిపోలేనన్నాడు. నన్ను పెళ్ళి చేసుకుంటే అది నాకూ, రమకూ చేసిన ద్రోహమే అవుతుందన్నాడు. నాతో మాట్లాడుతున్నంతసేపూ ఈ ఉంగరాన్నే చూశాడు. అది అతని ప్రాణం. దీన్ని చూస్తూనే అతను పిచ్చివాడై పోతున్నాడట. ఆ ఉంగరం నాకిచ్చెయ్యమన్నాను. మొదట ఇవ్వనన్నాడు. తర్వాత ఓ విధంగా బలవంతంచేసి

నేనే లాక్కున్నాను ఈ ఉంగరాన్ని. అప్పట్నుంచీ ఇది నా దగ్గరే ఉంది. విచిత్రమేమిటో తెలుసా, ఇది నా దగ్గర కొచ్చిం తర్వాత రాజేష్ మామూలు మనిషయ్యాడట. నేనేమో పిచ్చిదాన్నై పోయాను'. దీర్ఘంగా నిట్టూర్చిందామె.

రమ చచ్చిపోయిన సంగతి కానీ, ఆ రాజేష్ సంగతి కానీ నా కింతవరకూ తెలియదు. ఇన్నేళ్ళ తర్వాత మళ్ళీ వాళ్ళను గురించి ఆలోచించి మనసు పాడుచేసుకుని ఈ సైకాలజీ ప్రొఫెసర్ సానుభూతిని పొందే దీనస్థితిలో లేనిప్పుడు నేను.

'నా కింకో గంటలో ఓ అపాయింట్ మెంటుంది. వెళ్తా న్నేను' అన్నాను వాచీ చూసుకుంటూ.

'నో ఫియర్స్. నువ్వీ రాత్రికి ఇక్కడ ఉండాల్సిందే' లోపల్నుండి రూం లాక్ చేసేసి తాళాన్ని జాకెట్లో వేసేసుకుందామె.

'నీకు తెలీదు రాణీ. వయసైతే వచ్చిందిగానీ కోరికలుమాత్రం కుర్రవే నాకింకా. నేను చాల బలహీనుణ్ణి' అన్నాను.

'ఫర్వాలేదు. కొందరి బలహీనత, మరికొందరికి ఆనందదాయకం కావచ్చుగా !' కొంటెగా నవ్విందామె. నా ఒళ్లు పులకరించింది.

భోజనాలు పూర్తిచేశాం.

'నువ్వు పెళ్ళెందుకు చేసుకోలేదు ?' సూటిగా అడిగాను.

'డియర్ రాజా. జీవితంలో ఎన్నో అనుకుంటాం. నన్ను ఉదాహరణగా తీసుకోండి. మా వాళ్ళందర్నీ పైకి తీసుకురావాలని చిన్నప్పటినుండీ ఎన్నో కలలు కన్నాను. ఆ కలలన్నీ నిజంచేసుకుని అందర్నీ ఉన్నతమైన స్థానాల్లోనే కూర్చోబెట్టగలిగాను. ఆఖరికి నన్ను నేను చూసుకునేసరికి మూడు పదుల వయసూ, ఒంటరి జీవితం నన్ను చూసి వెక్కిరించాయి. ఒకప్పుడు నేను పెళ్ళి వద్దన్నాను.

ఇప్పుడు పెళ్ళే నన్ను వద్దంటోంది. నే నెవర్నీ అర్థించను. అటువంటి అలవాటు నాకు లేదు. నిన్ను సూటిగా అడుగుతున్నాను. ఈ ఉంగరాన్ని, ఉంగరం ఉన్న చేతినీ నువ్వు స్వీకరించ గలవా'!

మళ్ళీ అదే దర్పం, అదే ఠీవి. మగవాణ్ణి శాసించే అందమైన అహం.

'నాకు పెళ్ళయింది రాణీ. ఇద్దరు పిల్లలుకూడా.'

విరగబడి నవ్వింది మహారాణి.


'సిల్లీ ఫూల్. నీకు పెళ్ళికాకుండా నువ్వింతకాలం బ్రహ్మచారిగా ఉన్నా వనీ, నాకోసం నిరీక్షిస్తున్నావనీ నేనను కున్నానా ! ఐ డోంట్ వాంట్ యువర్ ఎంటైర్ లైఫ్. నీ జీవితంలో కొన్ని



యుప

## నిత్యజీవితంలో హస్తాభినయములు

**"చతురము"**




గంటలు నాకోసం వెచ్చించు. నా ఒంటరితనాన్ని తాత్కాలికంగానైనా దూరం చెయ్యి. ఒక లక్ష్యాన్ని నాకు ఏర్పాటు చెయ్యి. నాకోసం వచ్చే మనిషి, నేనంటే అభిమానించే వ్యక్తి ఒకడున్నాడనే భావన, ఆత్మతృప్తి నాకు కలిగించు. దట్సాల్.' ఆ కళ్ళల్లో ఆరాధన అర్థంకాని, అంతంలేని భావ లహరి. నా చేతిని మౌనంగా ముందుకు చాచాను. ఉంగరాన్ని నా చిటికెన వేలికి తొడిగి దాన్ని ముద్దుపెట్టుకుందామె.

నేను పీయూసి చదివేటప్పుడు మా ఫ్రెండ్ ఒకడు నా ఆటోగ్రాఫ్ పుస్తకంలో రాశాడు. 'రింగ్ ఈజ్ రౌండ్. ఉచ్ హేజ్ నో ఎండ్. సచ్ ఈజ్ లవ్' మహారాణీని రెండు చేతుల్లోనూ దగ్గరకు తీసుకున్నాను. అదే సౌకుమార్యం, అదే లాలిత్యం. సుతిమెత్తనిపట్టులాంటి శరీరం. మనసును మత్తెక్కించే సౌరభం. మహారాణీలు వాడే సుగంధ ద్రవ్యాలు వెలువరించే సువాసన.

వెల్. ఆ తర్వాత మీ కనవసరం.